క్లుప్తంగా

జగనన్న గోరు ముద్ద తనిఖీ



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ

దొరవారిసత్రం: మండలంలోని తనియాలి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జగనన్న గోరు ముద్ద అమలు తీరును ఎంఈఓ కృష్ణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం పాఠశాలలోని వివిధ రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల విద్యాబోధనపై ఆరా తీశారు. సకాలంలో విద్యార్థులకు పాఠ్యాంశాలు పూర్తి చేయడంతోపాటు మెనూ ప్రకారం భోజనం పథకం నిర్వహించాలని ఎంఈఓ ఉపాధ్యాయులకు సూచించారు.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా నగదు అందజేస్తున్న సిబ్బంది

దొరవారిసత్రం: శ్రీధనమల్లి గ్రామానికి చెందిన వేనాటి జలంధర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా నగదును బుధవారం అందజేశారు. జలంధర్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యులకు మంజూరైన వైఎస్సార్ బీమా నగదు రూ.10 వేలను పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌మస్తాన్, వైఎస్సార్ సీపీ నాయకుడు పీ ప్రసాద్‌రెడ్డి అందజేశారు. మిగిలిన బీమా నగదు రాష్ట్ర ప్రభుత్వం మృతుడి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

పొగ లేని పొయ్యిల పంపిణీ



పొయ్యిలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

గూడూరురూరల్: మండలంలోని పాలిచెర్లలో మహిళలకు ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి, ఫౌండేషన్ జిల్లాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఉచితంగా పొగ లేని పొయ్యిలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెల్లో ఇంధన పొదుపులో భాగంగా మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేలా పొగ లేని పొయ్యిలను వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కమ్యూనిటీ ఫెసిలిటేటర్లు, మస్తానమ్మ, మస్తానయ్య, గోపాల్ పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య సేవలు అందిస్తున్న వైద్యురాలు సుమ

చిల్లకూరు: మండలంలోని తొణుకుమాలలో బుధవారం చింతవరం ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తొణుకుమాలలో పలువురు విష జ్వరాలతో బాధ పడుతున్నారు. దీనిపై స్పందించిన చింతవరం వైద్యులు పాల్ జాన్సన్, వైద్యురాలు సుమ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వర పీడితులకు ఉచితంగా పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అలాగే గ్రామంలో పూర్తి స్థాయిలో రక్త పరీక్షలు చేయించడంతో పాటు మరోసారి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రామకృష్ణ తీర్థ ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

తిరుమల: తిరుమలలో గురువారం జరగనున్న శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటికి టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 7.30 గంటలకు శ్రీవారి ఆలయ అర్చకులు మంగళవాయిద్యాలతో పూలు, పండ్లు, స్వామివారి ప్రసాదాలు తదితర పూజా సామగ్రిని శ్రీరామకృష్ణ తీర్థానికి తీసుకెళతారు. అక్కడ శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పిస్తారు. అధికబరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు న్నవారు, వృద్ధుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అటవీ మార్గంలో ఈ తీర్థానికి నడిచి వెళ్లడానికి అనుమతి లేదని అధికారులు తెలిపారు. అలాగే గోగర్భం డ్యామ్ పాయింట్ నుంచి పాపవినాశనం వరకు యాత్రికులను తరలించేందుకు ఆర్టీసీ దాదాపు 35 బస్సులను ఏర్పాటు చేసిందన్నారు. గురువారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే యాత్రికులను ఈ తీర్థానికి అనుమతిస్తారు. యాత్రికులకు టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో పాలు, కాఫీ, పొంగళి, ఉప్మా, సాంబారు అన్నం, పెరుగన్నం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు.

కండలేరులో 12.270 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 12.270 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 160 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించండి

- మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి



మున్సిపల్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి

డక్కిలి (బాలాయపల్లె): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి అందరూ సహకారం అందించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కోరారు. బుధవారం బాలాయపల్లె మండలం జయంపు గ్రామంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనతో కొంత సేపు చర్చలు జరిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలాయపల్లె మండలంలో అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో తాను కూడా అందుబాటులో ఉండి, అందరినీ సమన్వయం చేసుకుంటూ వైఎస్సార్ సీపీని గెలిపించుకుని, సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు.

రమణయ్యకు రాజలక్ష్మి పరామర్శ

డక్కిలి: మండలంలోని లింగసముద్రం పంచాయతీ చాకలపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎం రమణయ్యనాయుడిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి బుధవారం పరామర్శించారు. రమణయ్యనాయుడి భార్య సరోజనమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆమె చాకలపల్లె గ్రామానికి వెళ్లి, రమణయ్యనాయుడితోపాటు ఆయన కుటుంబ సభ్యులు సురేష్, రమేష్‌ను పరామర్శించారు. ఎంతో కాలంగా నేదురుమల్లి జనార్దనరెడ్డికి అభిమానులుగా ఉండే వారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వీ మల్లికార్జున, వేణునాయుడు, గోవర్ధన నాయుడు, ఆదిరెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి దుస్తుల పంపిణీ

సైదాపురం(వెంకటగిరి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులకు పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో వెంకటగిరిలో శాశ్వతమైన అభివృద్ధి చేసింది ఒక నేదురుమల్లి కుటుంబమేనన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ ప్రభంజనం మోగించనుందని చెప్పారు. ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ రానున్న 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది, నియోజకవర్గంలోని పలు మండలాల నాయకులు నేదురుమల్లి రాజ్యలక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, కౌన్సిలర్లు ఏ శ్రీనివాసులు, ఆరి శంకరయ్య, వహిద, సుబ్బారావు, నాయకులు రొంటాల చిన్నా, రావెళ్ల వెంకటకృష్ణమనాయుడు, సదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల పరిశీలన



టిడ్కో గృహాలను పరిశీలించి, అధికారులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



జయంపులో ఎంపీపీ భాస్కర్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి

వెంకటగిరిరూరల్: పట్టణంలోని టిడ్కో గృహాలను వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 1,008 గృహాలు నిర్మాణం పూర్తి అయ్యిందని, అవి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈనెల 28వ తేదీలోపు మౌళిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. 29వ తేదీన జిల్లా ఇన్‌చార్జి మంత్రుల సమక్షంలో లబ్ధిదారులకు గృహాల పంపిణీకి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ డీ శారద, బాలకృష్ణ, టిడ్కో ఈఈ ఉమామహేశ్వరరావు, డీఈ రంగయ్య, ఏఈ కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అనిత

చిల్లకూరు: మండలంలోని పలు గ్రామాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములను కొంత మంది భూ స్వాములు ఆక్రమించుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులుకు ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్ అనిత విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆమె మండల రెవెన్యూ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కే జగదీష్‌తో కలసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ చిల్లకూరు మండలంలోని రెవెన్యూ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నందున ఎక్కడి నుంచో వచ్చిన పెద్దలు కొందరు తమ ఇష్టం వచ్చినట్లు పేదల భూములు ఆక్రమించుకుంటున్నారన్నారు. ఈ క్రమంలోనే 1976లో ఎన్ గోపాలయ్య పేరుతో అప్పటి రెవెన్యూ అధికారులు కడివేడు రెవెన్యూలో 3.18 ఎకరాల భూమిని సీజేఎఫ్ఎస్ కింద అందజేశారని చెప్పారు. రెండేళ్ల క్రితం ఓ భూస్వామి ఈ భూమిలో రెండెకరాలను ఆక్రమించుకున్నాడని, అప్పటి నుంచి ఆక్రమణదారునిపై చర్యలు తీసుకుని, తన భూమి తనకు ఇప్పించాలని ఆయన కోరినా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ శనివారం సర్వేయర్ వచ్చి కొలతలు వేసి, ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికకు టీడీపీ నేతలు సిద్ధం



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ

గూడూరురూరల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని బుధవారం ఎంపీపీ గురవయ్య తెలిపారు. ఎంపీపీ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కే సునీల్‌రెడ్డితో కలసి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన టీడీపీ నాయకులకు ఏ విధంగా అందుతున్నాయన్న విషయాన్ని వారికి తెలియజేశారు. దీంతో టీడీపీ నాయకులు 30 కుటుంబాలతో కలసి గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ సమక్షంలో ఈ నెల 28వ తేదీన వైఎస్సార్ సీపీలో చేరనున్నట్లు టీడీపీ నేతలు ప్రకటించారు. చర్చలు సఫలం కావడంతో కేక్ కట్ చేసి, అందరికి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో వై విజయకుమార్, పీ వెంకటేశ్వర్లు, వై మనోజ్‌కుమార్, సాయి, అనీల్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

దొరవారిసత్రం: మండలంలోని వేణుబాకంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మండలంలోని వేణుంబాకం ఎస్సీ కాలనీ చెందిన డీడీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు కే శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఆ సంస్థ జిల్లాఅధ్యక్షుడు సమదేవయ్య తన గ్రామంలో నిర్వహించి శంకరయ్య సంతాపం సభలో పాల్గొని, వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పరసారత్నం, చెన్నైకు చెందిన సంస్థ నిర్వాహకులు ఇశ్రాయిల్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే బీసీలకు గుర్తింపు



మాట్లాడుతున్న కార్పొరేషన్ల చైర్మన్లు

నాయుడుపేటటౌన్: స్వాతంత్రం వచ్చిన తరువాత తొలిసారిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే బీసీలకు గుర్తింపు, గౌరవం లభించిందని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కే నారాయణ ముదిరాజ్ అన్నారు. పలు కార్పొరేషన్ల చైర్మన్లు విజయవాడ నుంచి తిరుమలకు వెళుతూ మార్గం మధ్యలో బుధవారం నాయుడుపేటలో విలేకరులతో మాట్లాడారు. నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ ఎంత మంది, ఎన్ని పార్టీలు కలసి వచ్చినా సీఎం జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అజెండా, ప్రజాసంక్షేమమే ఆయనకు అండగా నిలుస్తాయని చెప్పారు. ఏపీ జంగమ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వీ ప్రసూన మాట్లాడుతూ దశాబ్దాలుగా బీసీల కలగా ఉన్న కులగణనను సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిజం చేస్తూ కులగణన ప్రక్రియ వేగవంతంగా జరుపుతున్నారన్నారు. వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎస్ గాయత్రి మాట్లాడుతూ మహిళలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించేలా అసెంబ్లీ సాక్షిగా 50 శాతం రిజర్వేషన్లు కల్పించి, తీర్మానం చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో మహిళలతోపాటు బీసీ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలందరు సీఎంకు అండగా నిలుస్తారన్నారు. బొందిలి కార్పొరేషన్ చైర్మన్ ఎస్ కిషోర్‌సింగ్ మాట్లాడుతూ గతంలో రాష్ట్రాన్ని సర్వనాశం చేసిన చంద్రబాబుకు, ఆయనతో పాటు కలిసి వస్తున్న పవన్‌కు, పగటి కలలు కంటున్నా మొద్దుబాబు లోకేష్‌కు వచ్చే ఎన్నికల్లో తిరిగి భంగపాటు తప్పదన్నారు.

ఆర్థిక సాయం



చెక్కులు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు, ఎస్ఐ

చిల్లకూరు: రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోయిన ఓ కుటుంబానికి పేర్నాటి చారిటబుల్ ట్రస్టు అధినేత పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని చింతవరం గ్రామానికి చెందిన జోగి శ్రీనివాసులు గత శనివారం కలవకొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో భార్య ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. ఈ విషయాన్ని స్థానికులు శ్యాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన చారిటబుల్ ట్రస్టు ద్వారా కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ట్రస్టు ప్రతినిధుల ఆ గ్రామానికి వెళ్లి శ్రీనివాసులు కుటుంబాన్ని పరామర్శించి, ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల వంతున ఆర్థికసాయం అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు ఎస్ఐ అంజిరెడ్డి, ట్రస్టు ప్రతినిధులు అనిల్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, కానిస్టేబుల్ విష్ణు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి పెన్సిల్ ఆర్ట్ బహూకరణ



నేదురుమల్లి రాజ్యలక్ష్మికి పెన్సిల్ ఆర్ట్‌ను బహూకరిస్తున్న కళాకారుడు శంకర్‌బాబు

వెంకటగిరిరూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మికి పట్టణానికి చెందిన పెన్సిల్ కళాకారుడు పోలిశెట్టి శంకర్‌బాబు బుధవారం పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో రాజ్యలక్ష్మిని కలిసి ఆమెకు పెన్సిల్ ఆర్ట్‌ను బహూకరించారు. అనంతరం శంకర్‌బాబుకు నేదురుమల్లి రాజ్యలక్ష్మి, రామ్‌కుమార్‌రెడ్డిలు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువ కప్పి, అభినందించారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

వెంకటగిరిరూరల్: నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు వెంకటగిరిలో బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వెంకటగిరి మున్సిపాలిటీ, రూరల్ మండలాలకు సంబంధించి పది జట్లు ఎంపిక కాగా క్రికెట్ పురుషుల విభాగం క్రీడాకారులకు తారక రామ క్రీడా ప్రాంగణం, మహిళా క్రీడా విభాగం క్రీడాకారులకు ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రాంగణం, ఖోఖో, త్రోబాల్, వాలీబాల్, కబడ్డీ పోటీలను విశ్వోదయ కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక అధికారి నాగార్జునసాగర్, ఎంపీడీఓ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జట్లకు సంబంధించి ఈ నెల 27వ తేదీ వరకు క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిభ చూపిన జట్లను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వారు తెలిపారు.

ప్రతిభ వెలికితీతకే ఆడుదాం ఆంధ్రా



గూడూరు రూరల్: క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

గూడూరురూరల్: గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహిస్తోందని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో బుధవారం గూడూరు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి క్రీడా కారులు జిల్లా స్థాయికి పోటీ పడేలా క్రీడల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. క్రికెట్ పోటీల్లో మొదటి మ్యాచ్‌లో చిల్లకూరు మండలం మోమిడి సచివాలయం జట్టు, చిట్టమూరు మండలం కోగిలి సచివాలయం జట్టు తలపడగా మోమిడి జట్టు విజయం సాధించింది. అలాగే రెండో మ్యాచ్‌లో వాకాడు మండలం నెల్లిపూడి సచివాలయం, గూడూరు మండలం పాలిచెర్ల సచివాలయం జట్టు తలపడగా నెల్లిపూడి సచివాలయం జట్టు విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో మోమిడి, కోట మండలం కొత్తపట్నం సచివాలయం జట్టు తలపడగా కొత్త పట్నం జట్టు విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వాకాడు ఎంపీడీఓ గోపీనాథ్, ఆడుదాం ఆంధ్రా కోఆర్డినేటర్ శివకుమార్ పాల్గొన్నారు.

మన్నారుపోలూరు క్రీడాకారుల ప్రతిభ

సూళ్లూరుపేట: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల్లో మన్నారుపోలూరు జట్టు ప్రతిభ చూపి, ఫైనల్స్‌కు చేరింది. మండలస్థాయి క్రికెట్ పోటీల్లో మంగళపాడుకు చెందిన జట్టుపై మన్నారుపోలూరు జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం జరిగిన నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల్లో పెళ్లకూరు మండలం జట్టుపై మన్నారుపోలూరు జట్టు విజయం సాధించి నియోజకవర్గ స్థాయిలో ఫైనల్స్‌కు చేరుకుంది. నియోజకవర్గ స్థాయి ఫైనల్స్‌లో సూళ్లూరుపేట వర్సెస్ నాయుడుపేట జట్లు తలపడనున్నాయి. జట్టును పీడీ భాస్కర్, మన్నారుపోలూరు సచివాలయ సిబ్బంది పురిణి కృష్ణయ్య, ఎస్ తేజస్విని, జీ నిఖిల్, ఎం రాజేశ్వరి తదితరులు అభినందించారు.

ఆడుదాం ఆంధ్రా క్రికెట్ విజేత కోట

కోట: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో కోట మహిళా జట్టు విజేతగా నిలిచిందని పీఈటీ వలీఅహ్మద్ తెలిపారు. గూడూరులో బుధవారం జరిగిన క్రికెట్ పోటీల్లో చిల్లకూరు మండలం జట్టుపై కోట జట్టు విజయం సాధించినట్లు తెలిపారు. క్రికెట్ పోటీల్లో సత్తా చాటిన మహిళా జట్టును ఎంపీడీఓ భవానీ, ఎంఈఓ మస్తానయ్య అభినందించారు.



సూళ్లూరుపేట: క్రికెట్ పోటీల్లో గెలిచిన మన్నారుపోలూరు జట్టు



కోట: క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన కోట మహిళా జట్టు

జీపీడీపీపై శిక్షణ

కోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్(జీపీడీపీ)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ప్రత్యేకాధికారి శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు. 2024–25 సంవత్సరానికి పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళికపై చర్చించారు. ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి గ్రామసభ ద్వారా తీర్మానం చేయాలన్నారు. ఉన్న నిధులను సకాలంలో ఖర్చు చేసి పనులు చేపట్టాలన్నారు. మూడురోజుల పాటు శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. ఎంపీడీఓ భవాని, కిరణ్, రియాజ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ భూమనతో ఎమ్మెల్యే కిలివేటి భేటీ



టీటీడీ చైర్మన్ భూమనను కలిసిన కిలివేటి సంజీవయ్య

తిరుపతి మంగళం : సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య బుధవారం టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని పద్మావతిపురంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో కరుణాకరరెడ్డిని సత్కరించారు.

నేడు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం

కోట: మండల కేంద్రంలో గురువారం వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ చేతుల మీదుగా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ భవాని తెలిపారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహణపై అధికారులతో సమీక్ష జరిపారు. వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులంతా హాజరు కావాలని కోరారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరు భేష్



మాట్లాడుతున్న ఇరిగేషన్ ఏఈ రమేష్

తడ: ఇటీవల వచ్చిన తుపాను సమయంలో మండల అధికారులు సమర్థవంతంగా పని చేశారని, వారి పనితీరు భేష్ అని తహసీల్దార్ జయజయ రావు అన్నారు. మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం తడ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తుపాను సమయంలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, హౌసింగ్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ ఇలా అన్ని వ్యవస్థలు సమవర్థవంతంగా పని చేసి, ప్రజలకు సేవ చేశాయని కొనియాడారు. రైతులు సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు ఎంతో ఉపయోగకరమన్నారు. అలాగే భూసర్వేపై అనుమానాలు వద్దని, తొలి దశలో జరిగిన తప్పులు ప్రస్తుతం జరగడం లేదని, సర్వే జరిగిన ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థనలను పరిశీలించి, మళ్లీ సర్వే చేసి, తప్పులను సరి చేస్తున్నామని తెలిపారు. ఇరిగేషన్ ఏఈ రమేష్ మాట్లాడుతూ రూ. 5 లక్షల లోపు ఉన్న పనులను నామినేటెడ్ పద్ధతిలో ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. అంతకన్నా ఎక్కువ విలువ ఉన్న పనులకు టెండర్లు పిలిచి, నెల రోజుల్లో పనులు చేపడతామని తెలిపారు. ఏఓ కాంచన మాట్లాడుతూ తుపాను సమయంలో మండలంలో పంట నష్టం తీవ్రంగా జరిగిందని తెలిపారు. తొలుత వర్షాలు లేక ఇబ్బంది, తీరా పంట ఎదుగుతున్న దశలో తుపాను, అనంతరం తెగుళ్లతో ఈ ఏడాది పంట నష్టం తీవ్రంగా ఉందని చెప్పారు. ఈ క్రాప్ నమోదు చేసుకోవడం ద్వారా రైతులు పంట బీమా పొందే సౌకర్యంతోపాటు ధాన్యం కొనుగోలు సమయంలో, సున్నా వడ్డీకి ఈ క్రాప్ అవసరమని చెప్పారు. ఎంపీపీ రఘురెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ ఆమోసుబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ జీ సురేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ శంషాద్‌బేగం

వెంకటగిరిరూరల్: బాలికలు విద్యార్థి దశ నుంచే బాలికా హక్కులపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని సీడీపీఓ శంషాద్‌బేగం పేర్కొన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్యను అభ్యసించే దిశగా ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు రూపొందిస్తున్నాయని తెలిపారు. అలాగే గుడ్‌టచ్.... బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కలిగి జాగ్రత్తలు పాటించాలన్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే రక్తహీనతకు గురికాకుండా ఆరోగ్యకరంగా ఉంటారని చెప్పారు. చిన్నవయసులో బాల్యవివాహాలు చేయడం నేరమని, అలా ఎవరైనా చేస్తే 1098 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అంతకు ముందు హక్కులపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.